పంట ఎండింది.. ఆటో అమ్మేశా..

- ఇగ బతుకుడెట్ల? • నాలుగెకరాల్లో వరి ఎండింది
- బోర్లు వేసినందుకు రూ.1.60 లక్షల అప్పయ్యింది
- ఫ్రీ బస్సు స్కీమ్‌తో ఆటోను అమ్మేశా
- సూర్యాపేట జిల్లా చందుపట్ల రైతు కాశయ్య దీనగాథ

సూర్యాపేట, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడు నీళ్లు రాక నాలుగెకరాల్లో వేసిన వరి ఎండిపోయింది. మహిళలకు ఉచిత ప్రయాణంతో రోజూ ఐదారొందలు సంపాదించే ఆటో బండైంది. ఇయ్యాళ బతకాలంటే అప్పు చేయాల్సిన దుస్థితి వచ్చింది. ఏడేండ్లపాటు కేసీఆర్ ఇచ్చిన నీళ్లతో పండిన పంట, ఉపాధిని ఇచ్చిన ఆటోతో ధైర్యంగా బతికినోడు ఇప్పుడు జీవనాధారం కోల్పాయాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బండమీది చందుపట్లకు చెందిన శిగ కాశయ్య దీనగాథ ఇది. 'కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం కాను.. మా కుటుంబాలను నాశనం చేస్తుంది' అంటూ ఎండిన పొలాన్ని, చుక్క నీళ్లు రాని కాలువను చూపిస్తూ కాశయ్య శాపనార్థాలు పెడుతున్నాడు. కాశయ్యకు గ్రామంలో నాలుగు ఎకరాల సాగు భూమి ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయింది. 2018లో తొలిసారి నీళ్లు రావడంతో నాలుగు ఎకరాల్లో వరి వేశాడు. ఏడాదికి రెండు పంటలు వేయడంతో అన్ని ఖర్చులు పోనూ రూ.1.50 లక్షలు మిగిలేవి. భార్య, ముగ్గురు కూతుళ్లను సాకేందుకు ఆటో తోలడంతో నెలకు రూ.15 వేలు, ప్రతి సీజన్‌లో పంట పెట్టుబడి కింద ఏటా రూ.40 వేలు అందేవి. ఇలా రెండు మూడేండ్లలోనే కుటుంబ ఆర్థిక పరిస్థితి మారిపోయింది. ఆర్థికంగా కొంత బలపడటంతో నాలుగేండ్ల క్రితం పెద్ద కూతురి పెండ్లి చేయగా.. కల్యాణలక్ష్మి కింద రూ.లక్ష సాయం అందింది. మరో ఇద్దరు కూతుళ్లలో ఒకరిని ఇంజినీరింగ్, మరొకరిని డిగ్రీ చదివిస్తున్నాడు. ఇలా సంతోషంగా జీవిస్తున్న కాశయ్య కుటుంబం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఇబ్బందుల్లో పడింది.

నీళ్లు పోయినై.. ఆటో బండైంది

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత యాసంగికి నీళ్లు సరిగా రాక ఎకరం ఎండిపోగా.. ఈ యాసంగికి చుక్కనీరు రాక నాలుగెకరాల్లో పంట ఎండిపోయింది. నీళ్లు పోవడమే కాదు.. రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు సంపాదించే ఆటోను మహిళలకు ఉచిత బస్సు స్కీమ్‌తో అమ్మేసుకున్నా. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు కూడా రాకపోగా.. ప్రస్తుతం నాలుగు ఎకరాలు ఎండిపోగా రూ.1.60 లక్షల నష్టం వచ్చింది. పంటను కాపాడుకునేందుకు రెండు బోర్లు వేస్తే మరో రూ.40వేలు అప్పు అయ్యింది. బీఆర్ఎస్ హయాంలో జాలువారుతుండేది.

ఎండిన వరిని చూపిస్తున్న కాశయ్య

నీళ్లు బంద్ చేయాలని ఫోన్లు చేస్తే కానీ నీళ్లు బందయ్యేది కాదు. ఇయ్యాళ ఎన్ని ఫోన్లు చేసినా నీళ్లు వస్తలేవు. ఈ ప్రభుత్వానికి ఓటు వేసినందుకు బుద్ధివచ్చింది. ఈ ప్రభుత్వం నాశనం కాను.. మమ్మల్ని నాశనం చేస్తుంది.

– కాశయ్య, రైతు, బండమీది చందుపట్ల

కాంగ్రెస్ పాలనలో లంచం ఇస్తేనే పనులు

సిద్దిపేట కలెక్టర్ ఎదుట అమ్మ కమిటీ చైర్మన్ ఆవేదన

కొమురవెల్లి, మార్చి 15 : కాంగ్రెస్ పాలనలో లంచం ఇస్తే తప్ప పనులు కావడం లేదని కలెక్టర్ ఎదుటనే అమ్మ కమిటీ చైర్‌పర్సన్ వాపోయింది. సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి కొమురవెల్లి మండలం గురువన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ఏర్పాటు చేసిన ఏఐ(ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల కోసం లంచం అడుగుతున్నారని అమ్మకమిటీ చైర్‌పర్సన్ అన్నబోయిన బాలమణి, ప్రాథమిక పాఠశాల అమ్మకమిటీ చైర్‌పర్సన్ పుట్ట స్వప్న కలెక్టర్ ఎదుటనే వాపోయారు. బిల్లుల మంజూరు కోసం రూ. 8వేల వరకు అధికారులకు లంచం ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అమ్మకమిటీ సభ్యులకు రావాల్సిన బిల్లులను సాయంత్రం వరకు అధికారులు క్లియర్ చేశారు.

బిల్లుల విడుదలకు అధికారి లంచం అడిగినట్టు సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి తెలుపుతున్న బాలమణి

ఆర్థోస్కోపీపై అంతర్జాతీయ సదస్సు

గవర్నర్ చేతులమీదుగా ప్రారంభం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలకు సంబంధించిన అత్యాధునిక విధానాలపై హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో అంతర్జాతీయ సదస్సు, లైవ్ వర్క్‌షాప్ ప్రారంభమైంది. 'హైదరాబాద్ ఆర్థోస్కోపీ కాంక్లేవ్-2025' పేరుతో సికింద్రాబాద్‌లోని యశోద దవాఖాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శనివారం ప్రారంభించారు. రోబోటిక్ శిక్షణ, లైవ్ సర్జరీలు, వీడియో బోధనలో ఆర్థోపెడిక్ వైద్యులు, అధ్యాపకులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ సదస్సు సరైన వేదిక అని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సలో సాధించిన పురోగతి, అత్యాధునిక విధానాలపై దృష్టి సారించనున్నట్టు చెప్పారు. రెండ్రోజులపాటు జరిగే ఈ సదస్సు, లైవ్ వర్క్‌షాప్‌లో దేశం నలుమూలల నుంచి 600 మందికిపైగా ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొంటున్నట్టు సికింద్రాబాద్ యశోద దవాఖాన సీనియర్ స్పోర్ట్స్ ఆర్థోపెడిక్, ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ ఆర్ఏ పూర్ణచంద్ర తేజస్వి తెలిపారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాధారణం కన్నా 3.3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ఐఎండీ అధికారి ధర్మరాజు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

సింగరేణి రక్షణ, వైద్యం ప్రైవేటు చేతికి?

సంస్థ ప్రైవేటీకరణ వైపు మలి అడుగులు!

- రక్షణ, వైద్య విభాగాల ఉన్నతాధికారుల కాంట్రాక్ట్ నియామకం కోసం నోటిఫికేషన్
- జీఎం సెక్యూరిటీ, సీఎంవో కీలక పోస్టుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు
- సింగరేణి నిర్ణయంపై కార్మిక సంఘాల ఫైర్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ కుట్ర!

కరీంనగర్, మార్చి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి/గోదావరిఖని): సింగరేణి ప్రైవేటీకరణ కుట్రలు ఒక్కొక్కటీ బట్టబయలు అవుతున్నాయా? దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయా? ఇప్పటికే రెండు బ్లాక్‌ల గనులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన పాలకులు, తాజాగా ప్రైవేటీకరణలో భాగంగా మలి అడుగులు వేశారా? అంటే అవుననే సంకేతాలు వినిపిస్తున్నాయి. అత్యంత కీలకమైన సెక్యూరిటీ (రక్షణ విభాగం), వైద్య విభాగాల్లోని ఇద్దరు ఉన్నతాధికారులను ప్రైవేటు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడానికి తాజాగా యాజమాన్యం జారీచేసిన నోటిఫికేషనే ఆ అనుమానాలకు తావిస్తున్నది. సింగరేణి ప్రైవేటీకరణలో భాగంగా ఇప్పటికే కేంద్రం గనులకు వేలం వేస్తున్నది. సింగరేణికి చెందిన రెండు బ్లాక్‌లను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. కేంద్రం తీసుకున్న ఇలాంటి చర్యలను రాష్ట్ర సర్కార్ ఏనాడూ పెద్దగా వ్యతిరేకించలేదు. ప్రస్తుతం అత్యంత కీలక విభాగాల్లోని అత్యున్నత పోస్టుల్లో ప్రైవేటు వ్యక్తులను తీసుకునేందుకు చేపట్టిన చర్యలపై కార్మిక వర్గాలు మండిపడుతున్నాయి. ఇటీవల సింగరేణిలో జరుగుతున్న పలు పరిణామాలను లోతుగా గమనిస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కీలక పోస్టులకు కాంట్రాక్టు పద్ధతా?

సింగరేణి సంస్థలో అత్యంత కీలకమైన సెక్యూరిటీ (రక్షణ విభాగం) వింగ్‌కు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, మెడికల్ (వైద్య విభాగం) వింగ్‌కు చీఫ్ మెడికల్ సర్వీసెస్ ఆఫీసర్ పోస్టులను ప్రైవేటు కాంటాక్టు పద్ధతిలో నియమించేందుకు సింగరేణి సంస్థ తాజాగా నోటిఫికేషన్ జారీచేసింది. ఈ రెండు పోస్టులకు ఈ నెల 10 నుంచి 24 వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చింది. 63 ఏండ్లలోపు వయసు కలిగిన రిటైర్డ్ అధికారులు అర్హులని, నెలకు రూ.2 లక్షల చొప్పున జీతభత్యాలు ఉంటాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పోలీస్ శాఖలో డీఎస్పీ ఆపై స్థాయిలో రిటైర్డ్ అయిన వారికి రక్షణ విభాగంలో, మెడికల్ విభాగంలో రైల్వే ఇతర ప్రభుత్వరంగ దవాఖానలలో 10 నుంచి 15 ఏండ్ల అనుభవం కలిగిన రిటైర్డ్ అధికారులకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నది. ప్రస్తుతం రక్షణ విభాగానికి సెక్యూరిటీ చీఫ్‌గా జీఎం వ్యవహరిస్తున్నారు. వైద్య విభాగానికి సీఎంవో ఉన్నతాధికారిగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ వ్యవహరిస్తున్నారు. కొత్తగా తీసుకునే వారిని ప్రస్తుతం ఉన్నతాధికారుల స్థానంలో నియమిస్తారా? లేదా అదనపు బాధ్యతలు అప్పగిస్తారా? లేకుంటే ఈ రెండు వింగ్‌లను వీరి పరిధిలోకి తీసుకెళ్తారా? లేక యథావిధిగా కొనసాగిస్తారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రక్షణ విభాగంలో అవినీతికి ఆస్కారం?

అత్యంత కీలకమైన విభాగాల్లో సింగరేణి సంస్థ కాంట్రాక్టు పద్ధతిలో ఉన్నతాధికారులను నియమించేందుకు తీసుకున్న నిర్ణయంపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. సింగరేణి సంస్థలో 11 భూఉపరితల ఓపెన్ కాస్ట్ గనులు, 22 భూగర్భ గనులు పనిచేస్తున్నాయి. వీటికి తోడుగా అనేక విభాగాలు ఉన్నాయి. వీటన్నింటిలో బొగ్గు స్క్రాప్ ఇతర సామగ్రిని దొంగతనానికి గురికాకుండా ప్రస్తుతం సింగరేణి సెక్యూరిటీ అండ్ ప్రొటెక్షన్ కార్ప్స్ (ఎస్అండ్‌పీసీ) విభాగం పనిచేస్తున్నది. ఈ విభాగంలో ప్రైవేటు ఉన్నతాధికారి ప్రవేశించి వారిపై ఆధిపత్యం కొనసాగిస్తే వర్గపోరు తప్పదని హెచ్చరిస్తున్నారు. వీరివల్ల అవినీతి అక్రమాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్న చర్చ కూడా కార్మిక వర్గాల్లో నెలకొన్నది.

మెడికల్ అన్‌ఫిట్‌లో తలదూర్చే అవకాశం?

సింగరేణి సంస్థ వైద్య విభాగంలో ఇప్పటికే పలు అన్‌ఫిట్ కేసుల్లో భారీగా డబ్బు చేతులు మారుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. మరో ఉన్నతాధికారిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తే ఆయనకు ఉన్న విశేష అధికారాలతో మెడికల్ అన్‌ఫిట్ దందాలో తలదూర్చే అవకాశం ఉంటుందనే ఆరోపణలు వస్తున్నాయి. కోట్ల రూపాయలకు అవినీతికి ఆస్కారం ఉంటుందనే విమర్శలు వస్తున్నాయి. ఉన్న ఆ రెండు విభాగాలను పటిష్ఠం చేయడానికి బదులు, కాంట్రాక్టు ఉద్యోగాల పేరిట ప్రైవేటీకరణ చర్యలకు దిగుతున్నట్టు కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా సింగరేణిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి అడుగులు వేస్తున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కీలక విభాగాల్లో ప్రైవేట్ వ్యక్తులెందుకు?

కీలకమైన రెండు విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులను నియమించే చర్యను సింగరేణి విరమించుకోవాలి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి ఈ నియామకాలు చేపడుతున్నారు. గతంలో మాదిరిగా అనుభవం కలిగిన అధికారులను నియమించి ఆ శాఖలు పగడ్బందీగా నడిచేలా చూసుకోవాలి. ఈ రెండు కీలక విభాగాల్లో పరస్పర వైరుధ్యాలు ఏర్పడకుండా వెంటనే సింగరేణి చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోని నోటిఫికేషన్లను రద్దుచేయాలి. **– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు**

అధికారుల సంఘం జోక్యం చేసుకోవాలి

సింగరేణి అధికారుల సంఘం జోక్యం చేసుకుని ఈ నియామకాలను అడ్డుకోవాలి. సంస్థ అధికారులకు రావాల్సిన పోస్టులను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తుంటే ఊరుకుంటారా? సింగరేణి వ్యాప్తంగా అధికారులు ఈ చర్యను అడ్డుకోవాలి. ప్రభుత్వం వెంటనే నియామకాలను రద్దుచేయాలి.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్ణయయే

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు సింగరేణిలో రెండు కీలక విభాగాల్లో ప్రైవేటు వ్యక్తులను నియమించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అవినీతికి ఊతమిచ్చేలా ప్రైవేట్ ఉన్నతాధికారిని నియమించాలని చూస్తున్నారు.

– తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ సింగరేణి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

20 ఏండ్లు పబ్లిక్ లైఫ్‌లో ఉన్నా.. జర్నలిస్ట్‌లపై ఇలాంటి నిర్బంధాల్ని చూడలే!

- ప్రభుత్వాన్ని చూసి ప్రజలు భయపడే రోజులొచ్చినయి
- ఇంత దుర్మార్గపు పాలన సమాజానికి మంచిదా?
- గతంలో రేవంత్ వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన పేరిట సాగుతున్న కాంగ్రెస్ పాలనలో పౌర హక్కుల హననం జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతిపక్షంపై, ప్రశ్నించేవారిపై దాడులు జరుగుతున్నాయనే ఆరోపణలూ ఉన్నాయి. మీడియాపై దాడులు, జర్నలిస్టుల అక్రమ అరెస్టులను వారు ఉదహరిస్తున్నారు. మీడియాపై రేవంత్ సర్కారు ఉక్కుపాదం మోపిన ప్రస్తుత పరిస్థితులకు సరిగ్గా సరిపోయే వ్యాఖ్యలను మూడున్నరేండ్ల కిందటే ప్రతిపక్ష నేతగా ఉన్న రేవంత్ రెడ్డి చేశారు. ప్రస్తుత తన ప్రభుత్వాన్ని తానే తిట్టుకున్నట్టు ఉన్నాయి ఆ వ్యాఖ్యలు.

'ఏం జరుగుతున్నది ఈ తెలంగాణ సమాజంలో? ఏంది ఈ నిర్బంధాలు? ఈ ఒత్తిళ్లు ఏంది? ఈ నిర్బంధమేంది? ఈ రకమైన పరిస్థితులు మేం ఎప్పుడూ చూడలేదు. 20 ఏండ్ల నుంచి నేను పబ్లిక్ లైఫ్‌లో ఉన్నా.. ఈ పక్కన 40 ఏండ్ల నుంచి ఉన్నోళ్లు ఉన్నరు. విద్యార్థి దశ నుంచి ఇక్కడ పొన్నం ప్రభాకర్‌లాంటి వారు ఉన్నరు. మేం ఎప్పుడూ చూడలే. జర్నలిస్టులుగా మీరు ఆలోచన చేయండి. అంత నక్సలైట్లు ఉద్ధృతంగా ఉన్న సమయంలో కూడా ప్రజలు భయంభయంగా బతకలేదు. ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం.. ప్రజలు ఇష్టపడి ఓట్లేసిన ప్రభుత్వం.. ఈ ప్రభుత్వాన్ని చూసి ప్రజలే భయపడే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో వచ్చింది. మనం ఎన్నుకొన్న ప్రభుత్వానికి మనమే భయపడే పరిస్థితులు ఈ తెలంగాణ రాష్ట్రంలో వస్తే, ఇయ్యాల జర్నలిస్టులు కూడా.. ఏదైనా మాట్లాడాలంటే అటూఇటూ చూసుకొనే పరిస్థితి వచ్చింది. మీ గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పండి.. మీరు స్వేచ్ఛగా గతంలో జర్నలిస్టులుగా మీ అభిప్రాయాలు గాని, ప్రశ్నలు గాని, మీరు సమస్యల మీద పత్రికలనో, టీవీల్లోనో విశ్లేషణ చేసినట్టుగా ఈరోజు ఉందా? జర్నలిస్టులుగా మిమ్మల్నే ఒత్తిడి చేసి, మీ వృత్తిని మిమ్మల్ని నిర్వహించకుండా తెచ్చుకొన్న తెలంగాణ రాష్ట్రంలో ఇంత దుర్మార్గంగా, ఇంత భయపెట్టి పరిపాలన చేయాలనుకోవడం తెలంగాణ సమాజానికి మంచిదా? తెలంగాణ ఉద్యమంలో మీరు భాగస్వాములు కాదా? మీరు ఆరోజు తెలంగాణ ఉద్యమాన్ని నడపలేదా? మీరు నడిపి, మీరు ముందుకు తీసుకొచ్చి, మీరు కొట్లాడి, మీరు పోరాటం చేసి తెచ్చుకొన్న తెలంగాణలో జర్నలిస్టులుగా మీరు కూడా భయంభయంగా బతికే పరిస్థితి వస్తే ఇది పరాయి పాలన కాదా? తెచ్చుకొన్న తెలంగాణలో పరాయి పాలనలో భయపడుకుంటూ బతికే పరిస్థితులు మనకు అవసరమున్నయా? ఈ తెలంగాణ రాష్ట్రంలో..'

– 24.10.2021లో కరీంనగర్‌లో ఓ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి

జర్నలిస్టులు మౌనంగా ఉంటే అంతే!

అక్రమ నిర్బంధాలు జర్నలిస్టులకు కొత్త కాదు. ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో ఇలాంటివి చాలా చూశాం. జర్నలిజాన్ని పూర్తిగా తమ దొడ్లో కట్టేసుకోవాలనో.. లేకుంటే పాత్రికేయులందరినీ కూడా తమ బానిసలుగానో, లేకుంటే ఉపాధి హామీ కూలీలుగానో చూడాలనుకొని ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే ప్రయత్నం చేస్తుందో.. దానిపై కచ్చితంగా మీడియా మిత్రులు అందరూ కూడా ఆలోచన చేయాల్సిన సందర్భం వచ్చింది. మీరు మౌనంగా ఉంటే ఇయ్యాల రవిప్రకాశ్‌గారికి జరిగింది రేపు మీకూ జరగొచ్చు.

– రేవంత్‌రెడ్డి (08.10.2019)

నాడు దరువేసి.. నేడు చిందులా?

తెలంగాణ సమాజంలో 'సోషల్' పైత్యాన్ని నింపిందెవరు?

- గత ప్రభుత్వ పెద్దలపై నీచ ప్రచారానికి బిగిన 'కనుగోలు టీం' ఎవరిది?
- కేసీఆర్ కుటుంబంపై విషం చిమ్మినప్పుడు ప్రతిపక్ష హోదాలో దరహాసం చేసిందెవరు?
- బూతు పురాణమే ప్రాతిపదికగా రెచ్చిపోయిన వ్యక్తికి అండగా నిలబడిందెవరు?
- దాని ప్రామాణికంగానే ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చింది వాస్తవం కాదా?
- కేటీఆర్ తనయుడిని బాడీ షేమింగ్ చేసిన విషయాన్ని మరిచారా?
- మీ కుటుంబం దాకా వస్తే గానీ తెలియలేదా?
- ముఖ్యమంత్రి రేవంత్ తీరుపై రాజకీయ విశ్లేషకుల ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ప్రజాక్షేత్రంలో ఉన్నవారిపై రాజకీయ విమర్శలు సబబే.. అవసరమైతే విధానాలను ఎండగట్టడమూ సమంజసమే. కానీ, వ్యక్తిగత దూషణలు.. మరీ ముఖ్యంగా కుటుంబ సభ్యులను సైతం ఈ రొంపిలోకి లాగి ఇష్టానుసారంగా నీచ ప్రచారానికి దిగడం దుర్మార్గం. మరి.. తెలంగాణ సమాజంలో ఈ 'సోషల్' పైత్యాన్ని నింపిందెవరు? అసలు ఎప్పటినుంచి, ఎవరిని లక్ష్యంగా చేసుకొని ఈ విష క్రీడ మొదలైంది? తెల్లారింది మొదలు బూతుపురాణమే ప్రాతిపదికగా ఉద్యమ నేత అందునా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పెద్ద మనిషిని నోటికొచ్చినట్టు దూషించిన వారెవరు? వారికి ఒత్తాసు పలికి.. వారి భాషకు తందానా అంటూ దరువేసిందెవరు? పదేండ్ల పాటు సాగిన ఈ వికృత ప్రచారం ఇప్పుడు వెర్రితలలు వేస్తుండటంతో దానిపై చిందులేస్తున్నదెవరు? నిజమే.. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ అన్నట్టు సోషల్ మీడియాలో ఇలాంటి పోకడలను అరికట్టేందుకు అవసరమైతే చట్టాలను తీసుకురావాలి. కానీ, అంతకుముందు తెలంగాణ సమాజానికి దీనిని అలవాటుగా మార్చిన పరిణామక్రమంపైనా విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరముంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 15 నెలల్లోనే ఈ పైత్యం మొదలుకాలేదు. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా అన్ని రంగాల్లో తెలంగాణను దేశంలోనే ముందుంజలో ఉంచిన ఉద్యమ నేత, ముఖ్యమంత్రి హోదాలో ఉన్నపుడు సైతం ఈ విశృంఖలత్వం కొనసాగింది. ఇప్పుడు దీనిపై చిందులేస్తున్నవారే నాడు ప్రతిపక్ష పార్టీలో ఉండి ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని సాగుతున్న విష ప్రచారంపై వికటాట్టహాసం చేసిన సందర్భాలున్నాయి. ఒక దశలో తన నోటితోనే బాడీ షేమింగ్‌కు దిగిన దాఖలాలూ కండ్లముందే కదలాడుతున్నాయి. నియంత్రణ కొరడా ఎంత అవసరమో! ఆ దుస్సాంప్రదాయాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించిన ఘనులెవరనేది కూడా తెలంగాణ సమాజానికి ఖుల్లం ఖుల్లా తెలియాలి.

ప్రోత్సహించిందెవరు?

యూట్యూబర్లపై సీఎం రేవంత్ శనివారం అసెంబ్లీ వేదికగా మరోసారి విరుచుకుపడ్డారు. సీఎం తన ఆవేదనలో భాగంగా ఒక గొప్ప మాట అన్నారు. ప్రజాక్షేత్రంలో ఉన్నంత మాత్రాన తమపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడతారా? కుటుంబ సభ్యులను సైతం లాగి ప్రచారం చేస్తారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, వాస్తవానికి తెలంగాణ సమాజంలో ఈ పోకడ మొదలైంది ఇప్పుడు కాదు. ఆరేడేండ్లుగా నాడు కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్రలో భాగంగా మొదలైన నీచ సంస్కృతి పరాకాష్ఠకు చేరుకొని ఉద్యమ నేత కుటుంబమే లక్ష్యంగా ముందుకుసాగింది. తెల్లవారగానే విశ్లేషణల పేరిట ఒక వ్యక్తి తన సామాజిక మాధ్యమంలో నోటికొచ్చినట్టు కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని విమర్శిస్తుంటే తెలంగాణ సమాజమే నివ్వెరపోయింది. కానీ, ఇప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్న సీఎం రేవంత్ అప్పుడు ప్రతిపక్ష పార్టీ పెద్దగా సదరు వ్యక్తిని వెన్నుతట్టి ప్రోత్సహించడం తెలంగాణ సమాజం యాదిలో ఇంకా ఉంది. చట్టం తన పని తాను చేసినప్పుడు దానిని ఖండించడమే కాకుండా సదరు వ్యక్తి ఇంటికిపోయి పరామర్శించడం, చిరు మందహాసాలతో ప్రత్యేక ఇంటర్వ్యూలు పంచుకున్న వైనం కూడా అందరికీ తెలిసిందే. చివరకు బూతుపురాణమే ప్రాతిపదికగా రెచ్చిపోయిన సదరు వ్యక్తి కేసీఆర్ కుటుంబాన్ని ఇష్టానుసారంగా విమర్శిస్తుంటే 'ఇది సరైన విధానం కాదు' అని కనీసం అడ్డుచెప్పిన నోర్లు లేవు. పైగా దానినే ప్రామాణికంగా తీసుకొని సదరు వ్యక్తికి పార్టీ తరపున ఎమ్మెల్సీ టికెట్‌ను బహుమతిగా ఇచ్చిన వాస్తవమూ తెలంగాణ సమాజానికి తెలుసు.

నాటి తీరు సమర్థనీయమా?

సీఎం రేవంత్ శనివారం అసెంబ్లీలో తన ప్రసంగంలో కులగణన అంశాన్ని ప్రస్తావించారు. 'ఒక ఎమ్మెల్సీ కులగణన ను తప్పుబట్టారని అంటున్నా రు... అదే ఎమ్మెల్సీ గతంలో మీ (కేసీఆర్) కుటుంబం గురించి కూడా చాలా మాట్లాడారు. ఆ రెండింటినీ పక్క పక్కన పెడదామా?' అని ప్రశ్నించారు. అంటే సదరు ఎమ్మెల్సీ.. కేసీఆర్ కుటుంబంపై మాట్లాడిన తీరును రేవంత్ సమర్థిస్తున్నారా? వాటిని పక్కపక్కన పెట్టి బేరీజు వేద్దామంటున్నారంటే సదరు ఎమ్మెల్సీ నోటికొచ్చినట్టు మాట్లాడటం సరైన విధానమేనని సీఎం ధ్రువీకరించినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే క్రమంలో తనపై, తన కుటుంబంపై సామాజిక మాధ్యమంలో జరుగుతున్న ప్రచార తీరును సీఎం ఎండగట్టారు. ఇదెక్కడి సంస్కృతి? అని గద్దించారు. ఇదే కాదు.. గతంలో ప్రతిపక్ష పార్టీ పెద్దగా ఉన్నప్పుడు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి బాడీ షేమింగ్ చేసిన సందర్భం కూడా ఉంది. కేటీఆర్ తనయుడిని పట్టుకొని చిన్న పిల్లవాడు అని చూడకుండా బాడీ షేమింగ్ చేసి తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా సామాజిక మాధ్యమాలకు ఎలాంటి సంకేతాలు ఇచ్చారనేది గుర్తుచేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

అసెంబ్లీ వేదికగా ఆ పదాలు సరైనవేనా?

వాస్తవానికి ప్రజాక్షేత్రంలో ఉన్నవారిని వ్యక్తిగతంగా, అందునా వారి కుటుంబ సభ్యులను దూషించడమనేది అందరూ ఖండించాల్సిన అంశమే. ఇందులో ఎవరికీ ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. కాకపోతే ఈ క్రమంలోనే బాధ్యతాయుతమైన హోదాలో ఉన్నవారి నుంచి వచ్చే పదజాలం కూడా సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందనే అంశాన్ని గుర్తించాలని పలువురు సూచిస్తున్నారు. ఇటీవల ఇద్దరు మహిళా జర్నలిస్టుల అరెస్టు చోటుచేసుకుంది. ఇదే అంశాన్ని ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా తమపై, తమ కుటుంబ సభ్యులపై పోస్టులు చేస్తే 'బట్టలూడదీసి కొడతాం' అని వ్యాఖ్యానించారు.

తెలంగాణ సమాజం గుర్తించలేదనుకున్నారా?

కొన్నిరోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి రవీంద్రభారతిలో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర పదజాలంతో దూషించారు. స్టేచర్... స్ట్రెచ్చర్... మార్చురీ అంటూ స్పష్టంగా తనలోని అక్కసును వెళ్లగక్కారు. అదేరోజు తెలంగాణ సమాజం కూడా తీవ్రంగానే స్పందించింది. రాష్ట్రాన్ని